

మాట్లాడుకున్నాం కదా! మీరే చెప్పండి ఏదైనా.. ట్రైన్ ఆగబోతోంది. చెప్పండి త్వరగా.. ప్లీజ్!'' అన్నాను.

''మీరూ హైదరాబాద్‌లోనే కదా ఉండేది?''

''అవును.. కానీ, ఇద్దరిదీ పక్కపక్క ఇళ్లు కాదుకదా!'' అనేశాను అసంకల్పితంగా. అతడి 'మనసు'ని చదివేసిన ట్లుగా, అందులోని 'భావం' అర్థమైనట్లుగా!

జేబులోంచి ఏదో తీసి నాకివ్వబోతున్నట్లు చేయి ముందుకి చాచాడు.

''ఏమిటిది?'' అంటూనే తీసుకుని చూశాను.

విజిటింగ్ కార్డ్! అతడిది!!

* * *

''ఈరోజు పౌర్ణమి! నిద్ర పోవాలన్పించదు. మా ఇంట్లో అయితే ఆరుబయట కూర్చొని ఆకాశంలో చంద్రుడి వంక చూస్తూ జాగారం చేయాలనిపిస్తుంది..'' చెప్తూ ఆపాను మధ్యలో.

''ఔనా... పౌర్ణమి అంత బావుంటుందన్నమాట! అయితే..?''

''ఏం లేదు.. ఆరోజు నేను మీతో ట్రైన్‌లో మాట్లాడినం తగా ఇప్పటివరకూ నేనెవరితోనూ మాట్లాడలేదు. ఈరోజు మీతో మాట్లాడాలనే వచ్చాను. పౌర్ణమి వెన్నెలని చూస్తూ మా ఇంట్లో ఒంటరిగా, మౌనంగా ఉండటం కన్నా.. ఇక్కడ మీ ఇంట్లో, మీతో మాట్లాడుతూ, మరోవైపు చంద్రుణ్ని చూస్తూ గడపొచ్చనే ఉద్దేశంతో వచ్చాను..''

అతడి కళ్లలో 'వెలుగు' కన్పించింది నాకు.. చిత్రంగా!

''అయితే.. ఆ పౌర్ణమికి థాంక్స్!'' అన్నాడు నవ్వుతూ.

నాకు తెలీకుండానే నా హృదయం ఆనందంతో నిండి పోయింది. అతడు నవ్వుతూ, సరదాగా మాట్లాడటం చూస్తూంటే.. నాలాగే అతడు కూడా ఎప్పుడూ 'నవ్వడం' అనే అదృష్టానికి నోచుకోలేదేమో.. అనిపించింది.

''ప్రకృతిలో మీకు ఏదిష్టం?'' అడిగాను. నా మాటలకి నిస్సారంగా చేతివేళ్లతో కళ్లను నులుముకున్నాడతను.

''ప్రకృతిలో ఇష్టమైనవి అంటే.. ఎలాగూ చూడగలిగే వరం లేదు కాబట్టి వినడం వరకే నా భాగ్యం! వినడం, వాసన చూడటం, రుచి చూడటమే కదా నా జీవితం! ఆ మూడింటి ఆధారంగా చెబ్తున్నాను నాకు నచ్చినవేమిటో.. సంగీతం అంటే ఎంతో ఇష్టం. మల్లెపూల వాసన అన్నా చాలా ఇష్టం! ఇక రుచిలో.. రుచిగా ఉండేదేదైనా ఇష్టమే!'' అన్నాడు.

''మరి.. 'మనసు'కి నచ్చిన రుచుల్లో?'' అన్నాను.

వెంటనే బదులివ్వలేదతడు.

''మనసు రుచి.. మనసు రుచి..'' తడుముకుంటు న్నట్లు తనలోతానే పలికాడు రెండు మూడుసార్లు.

''మనసు రుచి అంటే.. మరోలా అనుకోకండి. మనస్త త్వాల్ని బట్టి ఫలానా రుచిపట్ల ఇష్టం ఉంటుందిగా!'' అన్నాను.

''తెలుసు..'' తెలుసన్నట్లుగా తలూపుతూ నవ్వాడు.

'ఏం చెబుతాడా...' అన్నట్లుగా ఎదురుచూడసాగాను.

నిజమే.. మనసుల్లో కూడా చాలా రకాలున్నాయి. అందరి మనస్తత్వం ఒకేలా ఉండదు. నాకు నచ్చిన, ప్రియ మైన 'మనసు రుచి'.. తనలోని లోపాల్నీ, లేమినీ దాచు కోకుండా ఆత్మసాక్షిగా, నిజాయతీగా, స్వచ్ఛంగా మాట్లాడే అతడి వైఖరి!

అతను చెప్పసాగాడు.. నేనేం మాట్లాడలేదు.. వింటూ ఉండిపోయాను.

''నాకు మీ మనస్తత్వం నచ్చింది. మీలోని సుగుణాలు కూడా! మీ గురించి మీకు తెలిసిందే గాక.. మీ గురించి పదిమందీ అనుకునేదీ, చెప్పుకొనేదీ కూడా చెప్పారు. మీ తప్పొప్పులూ, మీ గుణగణాలూ, మీలోని అవలక్షణాలూ.. అన్నీ వివరించారు. ఇన్నేళ్లకి, ఇన్నాళ్లకి 'మనిషి' అనే పదా నికి సరైన అర్థంలా మీరు నాకు కన్పించారు..''

''కన్పించానా..?''..

ఆనందం, గర్వం, మురిపెం.. ఒకేసారి ధ్వనించాయి నా స్వరంలో.

''ఔను.. కన్పించారు. నాలోని అంతర్నేత్రానికి! నా మనసుకి, నా మనోదృష్టికి! మీ మాటల్లో చెప్పాలంటే నా మేధో దృష్టికి కనిపించారు.. కనిపిస్తున్నారు! నేను మిమ్మల్ని చూడగలుగుతున్నాను!''

సంభ్రమంగా చూశానతణ్ని! నాపట్ల అతడి మదిలో దాచుకున్న భావాల్ని ఏ విధంగా, ఎలాంటి సమయంలో, ఎటువంటి సందర్భంలో వ్యక్తం చేస్తున్నాడో అర్థమై.. ఒక్క సారిగా స్త్రీ సహజమైన సిగ్గు కమ్మేసింది నన్ను.

ఆ తర్వాత ఎన్నో కబుర్లు చెప్పుకొన్నాం ఇద్దరం. ఆకా శంలో చంద్రుడివంక చూస్తూ, చల్లని వెన్నెలని ఆస్వా దిస్తూ, హాయి గొలిపే అతడి మాటలు వింటూంటే.. గంటలు కూడా క్షణాల్లా గడిచిపోయాయి.

''ఇక... వెళ్తా!'' అంటూ లేచాను.

''అప్పుడేనా..?'' దిగులుగా అన్నాడు.

''ఏం..? ఎప్పటికైనా వెళ్లాల్సిందే కదా?'' అన్నాను.

నిజానికి నాకూ వెళ్లాలని లేదు. కానీ, తప్పదు కదా?! నేను అన్నదానికి అతడేం బదులిస్తాడోనని ఎదురుచూ శాను. తనలో తానే తర్జనభర్జన పడుతున్నట్లుగా, సంది గ్ధంగా ఉండిపోయాడు చాలాసేపు. ఆ తర్వాత అన్నాడు..

''పౌర్ణమి.. ఇంత అద్భుతంగా ఉంటుందని నాకిప్పటి వరకూ తెలీదు!''

''నాక్కూడా..!'' నా మనసులోని అనుభూతి అతడి మాటల్లో వ్యక్తమయ్యేసరికి టక్కున అనేశాను.

''ఇలాంటి పౌర్ణములు ప్రతిరోజూ వస్తే ఎంత బావుణ్ను..!''

నా మనసుని చదువుతున్నట్లు ప్రతి భావాన్నీ అతడు మాటల్లో తెలుపుతూంటే విస్మయంగా చూశానతడి వంక.

''నాకూ అలాగే అన్పిస్తోంది. కానీ, అదెలా వీలవు తుంది?'' అన్నాను నిరాశగా.

అతడేమీ మాట్లాడలేదు. నాకింకేం మాట్లాడాలో తెలీ లేదు.

''సరే మరి.. వెళ్లనా!'' అయిష్టంగానే లేచి నించు న్నాను.

అప్పుడు కూడా అతడేమీ మాట్లాడలేదు. కాసేపు ఎదు రుచూసి..

''ఓకే. గుడ్‌నైట్!'' అంటూ అక్కణ్నుంచి కదిలాను.

అప్పుడన్నాడు హఠాత్తుగా..

''ఆశలు రేపడం మీకు బాగా తెలుసు..!''

ఆశ్చర్యంగా చూశానతడి వంక.

''నేను మీలో ఆశలు రేపానా..?'' అన్నాను.

''ఔను! సమాంతర రేఖలు ఎన్నటికీ కలవవేమో కానీ.. మనం కలిసి ఉంటామన్న నమ్మకం నాకుంది!'' అన్నాడు.

''ఎలా..?'' అప్రయత్నంగానే అడిగాను.

''అందరు భార్యాభర్తల్లా ఒకరి లోపాల్ని మరొకరు వేలెత్తి చూపుకొనే పరిస్థితి మనమధ్య రాదు కాబట్టి!''

''ఏమిటంత ధీమా? అందరు భార్యల్లాగే నేనూ మారి పోతే?''

''నువ్వు మారవు..!''

అతడి 'నువ్వు' అనే ఏకవచన సంబోధనలో ఆత్మీ యత, అనురాగమే కాదు.. నా మనసుని తన మనసుతో ఆత్మీయంగా తాకిన అనుభూతి, తన హృదయంతో నా హృదయాన్ని ఆప్యాయంగా హత్తుకున్న నిశ్చింత కూడా ధ్వనించింది.

''నేను మారనని అంత నమ్మకమేంటి మీకు?''.. అతడి ఉద్దేశం ఇంకాస్త స్పష్టంగా తెలుసుకోవాలని నా ప్రయత్నం.

''రెండు ఒకట్లు పక్కపక్కన చేరితే ఎంతవుతుంది?'' ఉన్నట్టుండి అడిగాడు.

అసందర్భ ప్రశ్నలా అన్పించి.. ఆశ్చర్యంగా అతడి వైపు చూసి, చెప్పాను వెంటనే

''పదకొండు!''

నవ్వాడతడు.

''చూశావా! నువ్వూ, నేనూ కలిస్తే 'రెండు' కాదు.. పద కొండు! అందుకే నువ్వు మారవు. మనం కలకాలం అన్యో న్యంగా ఉంటాం!'' అంటూ నా చేతిని తన చేతిలోకి తీసు కున్నాడు.

చిత్రం.. నా చేయి 'అందుకోవడానికి' అతడు తడుముకోలేదు.

* * *

ముప్ఫయ్ అయిదేళ్లు గడిచాయి..

ఒక పాప.. ఒక బాబు!

మామూలుగా కాదు. ఏ లోపమూ లేని సంపూర్ణ ఆరోగ్య వంతులు. ఎలాంటి వైకల్యమూ లేని పరిపూర్ణవంతులు!

పెళ్లిళ్లు కూడా ఘనంగానే చేశాం. మనవలూ, మనవరా ళ్లతో కాలక్షేపం చేయడమే మా దినచర్య ఇప్పుడు!

ఇన్నేళ్ల మా వైవాహిక జీవితంలో ఏనాడూ పల్లెత్తుమాట అనుకోలేదు ఇద్దరమూ.

ముఖ్యంగా.. మావారి 'అంధత్వం' నాకేనాడూ గుర్తు రాలేదు. అలాగే.. శరీరమంతా తెల్లని మచ్చలతో నిండిపో యిన నా 'చర్మవ్యాధి' కూడా ఆయనకి జ్ఞాపకం రాలేదు.

ఇంతకీ.. నా పేరేంటో చెప్పలేదు కదూ మీకు?

..'మానసవంశీ!'

ఏంటీ.. మావారి పేరేంటో కూడా చెప్పమంటారా?

ఊహుఁ.. చెప్పను! నా పేరు నుంచి కూడా ఆయన్ని విడదీయటం నేను తట్టుకోలేను! ■

## యస్వీ కృష్ణ



సాహిత్యం – రచనా వ్యాసంగాలనే వృత్తి– ప్రవృత్తులుగా మలచుకొని జీవనయానం సాగిస్తున్నారు యస్వీ కృష్ణ. రచయితగా, ప్రచురణ కర్తగా సుపరిచితులు. రసాయన శాస్త్రంలో ఎమ్మెస్సీ చదివారు. న్యాయశాస్త్రంలో పట్టా అందుకున్నారు. ఫైన్ ఆర్ట్స్ (శిల్పం)లో బీఎఫ్‌ఏ డిగ్రీ, శాస్త్రీయ సంగీతం (కర్ణాటక వయొలిన్)లో బీఏ చేశారు. శాస్త్రీయ నృత్యం(కథక్)లో డిప్లొమా చేసి జాతీయ ప్రదర్శనలూ ఇచ్చారు. ఇక సాహిత్యంలో.. కవి, కథా – నవలా రచయిత, వ్యాసకర్త, విమర్శకుడు, ప్రచురణకర్త కూడా. 'జయంతి పబ్లికే షన్స్' ప్రచురణ సంస్థను స్థాపించి.. వర్ధమాన రచయితలు మొదలుకొని లబ్ధప్రతిష్ఠులైన సాహితీవేత్తల రచనలను 410కి పైగా పుస్తకాలుగా ప్రచురించారు. తెలుగు సాహిత్యంలో అన్ని ప్రక్రియలలోనూ రచనలు చేస్తున్నారు. వీరి రచనలు దాదాపు అన్ని ప్రముఖ దిన–వార–పక్ష–మాస పత్రికలలో ప్రచురితమయ్యాయి. రేడియో–దూరదర్శన్లలోనూ ప్రసారమయ్యాయి. ఎన్నో రచనలకు బహుమతులు అందుకున్నారు. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో కొన సాగుతున్న 'ఇండియన్ సొసైటీ ఆఫ్ ఆథర (ఇన్సా)' సంస్థకు రెండు తెలుగు రాష్ట్రాల తరపున సమన్వయకర్తగా ఉన్నారు. పలు జాతీయ– అంతర్జాతీయ సాహితీ సదస్సులలో పాల్గొన్నారు.